

జైనూరులో 144 సెక్షన్ సడలింపు

ఆసిఫాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): జైనూరు మండలంలో 144సెక్షన్ సడలించినట్లు ఎస్పీ డీవీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థుల చదువును దృష్టిలో ఉంచుకుని వారికోసం జైనూరు మండలకేంద్రంలో ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటలవరకు 144సెక్షన్ సడలింపు ఇచ్చినట్లు తెలిపారు. గత నెలలో చెలరేగిన ఘర్షణల కారణంగా జైనూరు మండలకేంద్రంలో 144 సెక్షన్ విధించడం జరిగిందన్నారు. ప్రజలవినతుల మేరకు వారి పిల్లలచదువుల సౌకర్యార్థం సడలింపు ఇస్తున్నట్లు ఎస్పీ పేర్కొన్నారు. మిగితాసమయాల్లో 144సెక్షన్అమలులో ఉంటుంద న్నారు. ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే, అనుమతులు లేకుండా ర్యాలీలు, ధర్నాలు చేపడితే కఠినచర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి



పోలీసు అమరవీరులకు నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ



జ్యోతిప్రజ్వలన చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

ఆసిఫాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఏఆర్‌హెడ్‌క్వార్టర్స్‌లో ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ డీవీ శ్రీనివాసరావుతో కలిసి పాల్గొన్న కలెక్టర్ అమరవీరులకు నివాళులు అర్పించారు. అంతకుముందు ఎస్పీ,కలెక్టర్ పోలీసుల గౌరవవందనం స్వీకరించారు. అనంతరం పోలీసుఅమరవీరుల కుటుంబాలను పలుకరించి వారితో మట్లాడారు. అనంతరం పోలీసు అమరవీరుల కుటుంబసభ్యులతో కలిసి జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతినిత్యం ప్రజలభద్రత కోసం పోలీసులు పాటుపడడం వల్లనే ఈరోజు మనం ప్రశాంతమైన జీవితం గడుపుతున్నామన్నారు. విధినిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తుకు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. తమ కుటుంబాన్ని, వ్యక్తిగత జీవితాలను త్యాగం చేసి ప్రజల కోసం, ఉద్యోగనిర్వహణలో జీవితాలు అంకితం చేసిన వారందరికీ రుణపడి ఉన్నామన్నారు. ఎస్పీ డీవీ శ్రీనివాసరావు మాట్లాడుతూ విధినిర్వహణలో భాగంగా అమరులైన ఎందరో పోలీసు కుటుంబాల త్యాగాలఫలితమే ఈరోజు మనం అనుభవిస్తున్న ఈశాంతియుత సమాజమని అన్నారు. అమరులైన పోలీసు కుటుంబాలకు ఎళ్లవేళలా పోలీసుశాఖ సహాయసహకారాలు ఉంటాయన్నారు. వారు ఎప్పటికీ పోలీసుకుటుంబంలో సభ్యులే అని తెలిపారు. దేశవ్యాప్తంగా పోలీసు అధికారులు, సిబ్బంది తమ విధులను నిర్వ హించే క్రమంలో ప్రాణాలను అర్పించి అమరులను గౌరవంగా స్మరించేందుకు ఈరోజు అంకితం అన్నారు. ప్రజల భద్రతకోసం, శాంతికోసం తమప్రాణాలను అర్పించిన ఘనత పోలీసులదేనని అన్నారు. 1959లో లడఖ్‌లో చైనా దళాలతో జరిగిన ఓ మానవతా విరోధదాడిలో పదిమంది పోలీసులు ప్రాణాలు కోల్పోయారని అన్నా రు. అదే సంఘటనను గుర్తిస్తూ అక్టోబరు 21న పోలీసు అమర వీరుల సంస్మరణదినోత్సవాన్ని ప్రతిసంవత్సరం నిర్వహించుకుంటా మన్నారు. ఆసంఘటన నుంచి ఇప్పటివరకు వేలాదిమంది పోలీసులు దేశంకోసం ప్రాణత్యాగం చేశారన్నారు. మీత్యాగం చిరస్మరణీయం, అమరులైన పోలీసుసిబ్బందికి, వారి కుటుంబసభ్యులకు మా వందనం, ధన్యవాదాలు అని అన్నారు. అనంతరం శోక్‌శ్రస్త్ పరేడ్ నిర్వహించి చనిపోయిన పోలీసు అధికారులకు రెండునిమిషాలు మౌనం పాటించారు. అనంతరం అమరులైన పోలీసు కుటుంబ సభ్యులను శాలువాలతో సత్కరించి జ్ఞాపికలను ప్రదానం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీ కరుణాకర్, తదితరులు పాల్గొన్నారు.



తేనె శుద్ధి కేంద్రం

మహిళల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా..

- జిల్లాలోని ఐదు మండలాల్లో తేనెటీగల పెంపకం
- మండల సమాఖ్య ఆధ్వర్యంలో తేనేశుద్ధి కేంద్రం
- ఇప్పటి వరకు 15క్వింటాళ్ల శుద్ధి చేసిన తేనె విక్రయం

వాంకిడి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల మహిళలను ఆర్థికంగా అభివృద్ధి పర్చేందుకు జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ(డీఆర్డీఏ) సెర్ప్(గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ) ప్రత్యేక దృష్టి సారిస్తోంది. స్థానికంగా లభించే వనరులతో మహిళలు స్వయంఉపాధి పొందేలా అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా వాంకిడి మండలకేంద్రంలో మండల సమాఖ్య ఆధ్వర్యంలో తేనెశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. స్వయంసంఘాల సభ్యుల నుంచి కొనుగోలు చేసిన తేనెను శుద్ధి చేసి విక్రయిస్తున్నారు. దీంతో స్వయంసహాయక సభ్యులకు ఉపాధితోపాటు మండల సమాఖ్యకు లాభాలు చేకూరుతున్నాయి.

తేనెటీగల పెంపకం, ఉత్పత్తిపై శిక్షణ

తేనెటీగల పెంపకం, ఉత్పత్తి చేసేందుకు జిల్లాలోని ఆసిఫాబాద్, వాంకిడి, తిర్యాణి, సిర్పూర్(టీ), జైనూర్ మండలాల్లోని ఒక్కోగ్రామాన్ని ఎంపిక చేశారు. ఎంపికచేసిన గ్రామాల్లో 2022మే, జూన్ మాసాల్లో మండల సమాఖ్య ఆధ్వర్యంలో సభ్యులకు తేనె టీగల పెంపకంపై శిక్షణ ఇచ్చారు. శాస్త్రీయ పద్ధతుల్లో తేనెటీగలను పెంచడం, అందులోని తేనె సేకరించే విధానాలపై హైదరాబాద్ నుంచి వచ్చిన శిక్షకులు మెలకువలు నేర్పించారు. వాంకిడి మండలంలోని అటవీప్రాంతానికి దగరగా ఉన్న గ్రామాల సభ్యులకు తేనె పెట్టెలను పంపిణీ చేశారు. వాటిని తమ పంటపొలాల్లో అను కూలంగా ఉన్నచోట ఏర్పాటు చేసి తేనె ఉత్పత్తి అయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఒక్కో పెట్టెలో మూడు నుంచి నాలుగు కిలోల తేనె ఉత్పత్తి అవుతోంది. ఉత్పత్తి చేసిన తేనెను మండల సమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేసి తేనెశుద్ధి కేంద్రంలో శుద్ధి చేసిన తేనెను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. దీంతో సంఘాల సభ్యులకు ఆర్థికాభివృద్ధి చేకూరుతోంది.

ప్రభుత్వ సహకారంతో తేనె శుద్ధి కేంద్రం..

వాంకిడి మండల కేంద్రంలో వేంకటేశ్వర మండల సమాఖ్య ఆధ్వర్యంలో తేనెశుద్ధి కేంద్రం ఏర్పాటు చేశారు. డీఆర్డీఏ సంస్థ రూ.14.14లక్షల రూపాయలు కేంద్రం నిర్వహణకు నిధులు మం జూరు చేసింది. రూ.3.50లక్షలతో తేనె శుద్ధి యంత్రం కొనుగోలు చేయగా రూ.7లక్షలతో గ్రామీణ మహిళలనుంచి తేనె కొనగోలు చేసేందుకు తేనె పెట్టెలు కొనుగోలు చేశారు. అనంతరం తేనె ఉత్పత్తి చేసే విధానం, తేనె సేకరణ తదితర అంశాలపై సభ్యులకు శిక్షణ ఇచ్చారు.

సంఘాల సభ్యుల నుంచి కొనుగోలు..

గిరిజన స్వయం సంఘాల నుంచి కిలోకు రూ.250చొప్పున ఇప్పటివరకు 26క్వింటాళ్ల తేనెను కొనుగోలు చేశారు. శుద్ధి చేసిన తేనెను మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. గత ఆగస్టు15 కంటే ముందు వరకు కిలో తేనెను రూ.500చొప్పున విక్రయించగా ప్రస్తుతం రూ.600లకు విక్రయిస్తున్నారు. 50 గ్రాములు, 100గ్రాములు, 250గ్రాములు, 500గ్రాములు, 1కిలో చొప్పున సిసాలు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటివరకు 25క్వింటాళ్ల తేనెను శుద్ధి 15క్వింటాళ్ల తేనెను విక్రయించారు.

ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతోంది.

- మహేష్, ఐకేపీ ఏపీఎం



తేనెటీగల పెంపకం, ఉత్పత్తితో స్వయం సహాయకసంఘాల సభ్యులు ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడుతోంది. మండలంలో అటవీ ప్రాంతాలనికి దగ్గరగా ఉన్న గ్రామాల్లోని మహిళాసభ్యులకు తేనెటీగల పెంపకం, ఉత్పత్తిపై శిక్షణ ఇచ్చి, ఒక్కో సభ్యురాలికి అయిదు పెట్టెలను పంపిణీ చేశాం. సభ్యులు సేకరించిన తేనెను మండలసమాఖ్య ఆధ్వర్యంలో కొనుగోలు చేసి శుద్ధిచేసిన అనంతరం మార్కెట్లో విక్రయిస్తున్నాం. ఇప్పటివరకు సభ్యుల నుంచి 26క్వింటాళ్ల కొనుగోలు చేసి 15క్వింటాళ్ల తేనెను విక్రయించాం.

న్యూస్ బాక్స్

ఘనంగా కుమరం భీం వర్ధంతి

కెరమెరి: కుమరంభీం వర్ధంతిని సోమవారం మండలంలోని సాకడచౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. గ్రామం నుంచిర్యాలీగా చేరుకొని భీంవిగ్రహంవద్ద జెండాను ఆవిష్కరించి పూజలు నిర్వహించారు. అనంతరం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మాజీఎంపీపీ మోతీరాం, మాజీ జడ్పీటీసీ ద్రుపదాబాయి, మాజీ వైస్ఎంపీపీ అబ్దుల్‌కలాం పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల ఆగ్రహం

సిర్పూర్(టి): మండలంలో సంవత్సరాల తరబడి కల్యాణలక్ష్మి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడంతో సోమవారం బీజేపీనాయకులు తహసీల్దార్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదప్రజలను ఇబ్బందిపెడితే సహించేదిలేదన్నారు. కార్యక్రమంలో అశోక్, మహేష్‌జావీద్‌అహ్మద్ తదితరులు ఉన్నారు.

గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

పెంచికలపేట: పశుపోషకులు పశువులకు గాలికుంటు వ్యాధినివారణ టీకాలు వేయించాలని పశువైద్యాధికారి రాకేష్ అన్నారు. సోమవారం మండలంలోని లోడ్‌పల్లి గ్రామంలో గాలికుంటు వ్యాదినివారణ టీకాల కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ శ్రీనివాస్, జూనియర్ వెటర్నరీ ఆఫీసర్‌సురేష్,అటెండర్ ఆనందరావుపాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

దహెగాం: మండలంలోని హత్తిని గ్రామానికి చెందిన బక్కయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో సోమవారం బాధిత కుటుంబానికి పాల్వాయి యువసేన నాయకులు రూ.5500 ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు రాకేష్, నర్సింహులు, సుదర్శన్ పాల్గొన్నారు.

పోచమ్మ విగ్రహ ఉద్వాసన కార్యక్రమం

బెజ్జూరు: మండలకేంద్రంలోని పోచమ్మ ఆలయంలో పోచమ్మ, పోతరాజు, గణపతి విగ్రహాలను సోమవారం గ్రామస్థులు ఉద్వాసన కార్యక్రమం చేపట్టి భీమన్న ఆలయం ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. కార్యక్రమంలో నాయకులు శ్రీవర్ధన్, మహేష్, భాస్కర్‌రాజు, సుదాకర్‌గౌడ్ పాల్గొన్నారు.

మహిళా అవ్వల్ కమిటీ

బెజ్జూరు: మండల ఆదివాసీ మహిళా అవ్వల్ కమిటీని సోమవారం ఎన్నుకున్నట్లు వీటీడీఏ అధ్యక్షుడు ఓంప్రకాష్ తెలిపారు. అధ్యక్షురాలిగా అమృత, గౌరవఅధ్యక్షురాలిగా పుష్పలత, సుగుణ, ఉపాధ్యక్షురాలిగా యశోద, పద్మ, ప్రధానకార్యదర్శిగా పద్మ, కార్యదర్శులుగా నిర్మల, అమృత, కోశాధి కారిగా మమత, ప్రచార కార్యదర్శులుగా సత్యక్కతోపాటు పది మంది కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

విద్యార్థులకు ఎంఈవో సూచనలు

కౌటాల: మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలల్లో ప్రారంభమైన ఎస్ఏ-1పరీక్షలను సోమవారంఎంఈవో హన్మంతు పరిశీలించారు. విద్యార్థులకు సలహాలు, సూచనలు చేశారు.మెనూప్రకారం మధ్యాహ్నభోజనం అందించాలన్నారు.

శనగ విత్తనాల పంపిణీ

కౌటాల: మండలంలోని గురుడుపేట సహకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం రైతులకు డీసీఎంఎస్ వైస్‌చైర్మన్ మాంతయ్య శనగ విత్తనాలను పంపిణీ చేశారు. రైతులు తమ ఆధార్ కార్డు జీరాక్స్ అందించి 25కిలోల బస్తాకు రూ.2250చెల్లించి కొనుగోలు చేయాలనికోరారు.

నరేంద్ర మహారాజ్ జన్మదిన వేడుకలు

కౌటాల: వీర్దండి, గుండాయిపేట గ్రామాల్లో నరేంద్ర మహారాజ్ జన్మదిన వేడుకలను శనివారం భక్తులు ఘనంగా జరుపుకున్నారు. వీర్దండి గ్రామంలోని పలువీధుల గుండా పల్లకీసేవ నిర్వహించారు. అనంతరం ఆలయంలో పూజలు, భజన కార్యక్రమాలు నిర్వహించారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

జైనూరు: సోయా కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల సహకారసంఘం చైర్మన్ హన్నుపటేల్ తెలిపారు. సోమవారం మార్కెట్‌కమిటీ గోడౌన్‌లో సోయాకొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో మార్కెట్ మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, ఏడీవో వెంకటి, సీఈవో సోనాకాంబ్లే జనార్దన్, కార్యదర్శి ఇర్ఫాన్‌అహ్మద్‌పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత

కాగజ్‌నగర్: మండలంలోని ఈసుగాంలో వారం రోజుల క్రితం పోగొట్టుకున్న సెల్‌ఫోన్ సోమవారం ఈసుగాం ఎస్సై రామన్‌కుమార్ అందజేశారు. సాంకేతికతను వినియోగించుకొని పొగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను రికవరీ చేసిన్నట్టు తెలిపారు.

పోస్టర్ల ఆవిష్కరణ

కాగజ్‌నగర్: పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సోమవారం 50ఏళ్ల పీడీఎస్‌యూ వసంతాల పోస్టర్లను జిల్లా ప్రధానకార్యదర్శి జగజంపుల తిరుపతి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబరు 24న ఓయూలో ఠాగూర్ ఆడిటోరియంలో మహాసభ నిర్వహిస్తున్నట్టు అంతా విజయవంతం చేయాలని కోరారు.

ప్రజావాణి దరఖాస్తులను త్వరగా పరిష్కరిస్తాం



అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ దాసరి వేణు

ఆసిఫాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను త్వరగా పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని అదనపుకలెక్టర్ దాసరి వేణు అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్డీవో లోకేశ్వర్ రావుతోకలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. కాగజ్‌నగర్ మండలం మాలినికి చెందిన పరమేష్ తనకు ఆర్‌వోఎఫ్ఆర్ కింద పట్టాపాసు పుస్తకం మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు. దహెగాం మండలం రాంపూర్‌కు చెందిన గిరిజనులు తమకు గిరివికాస్ పథకం కింద బోరు బావులు తవ్వించారని, విద్యుత్ సరఫరా కల్పించి మోటారుపంపులు బిగించాలని అర్జీ సమర్పించారు. కాగజ్‌నగర్ పట్టణంలోని పోచమ్మబస్తీకి చెందిన దెబ్బటి పద్మ తన భర్త మరణించినందున తనకు వితంతుపెన్షన్ ఇప్పించాలని దరఖాస్తు అందజేశారు. బెజ్జూరు మండలం మర్తిడికి చెందిన శంకరబాయి ఆసరా పెన్షన్ ఇప్పించాలని, ఈదులవాడకు చెందిన యువకులు క్రీడాప్రాంగణం కేటాయించాలని, ఆసిఫాబాద్‌కు చెందిన చంద్రశేఖర్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగం ఇప్పించాలని, కౌటాల మండలంకు చెందిన వెంకటేశ్వర స్వయంసహాయక సంఘం ప్రతినిధులు తమగ్రామంలో రేషన్ డీలర్‌గా వరలక్ష్మిని నియమించాలని, రెబ్బెన మండలం రాంపూర్‌కు చెందిన ప్రేంకుమార్ ఈజీఎస్ ఉపాధికార్డు మంజూరు చేయాలని దరఖాస్తు అందజేశారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి..: సబ్ కలెక్టర్

కాగజ్‌నగర్: ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించేందుకు ఆయాశాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కాగజ్‌నగర్ సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లా అన్నారు. సోమవారం ప్రజాఫిర్యాదుల కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పెండింగ్ పనులు వెంటనే పూర్తిచేయాలన్నారు. అలాగే వివిధ గ్రామాల నుంచి ఫిర్యాదులు చేసిన వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 23మంది వివిధ సమస్యలపై అర్జీలు అందజేశారు.



అర్జీలను స్వీకరిస్తున్న సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా

రూ.2లక్షల రుణమాఫీ అందరికీ వర్తిస్తుంది

- జిల్లా వ్యవసాయాధికారి ఆర్ శ్రీనివాస్‌రావు



ఆసిఫాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా వ్యవసాయాధికారుల నియామకాలు చేపట్టగా జిల్లాకు కొత్తగా 11మంది మండల వ్యవసాయాధికారులను నియమించామని వారంతా సోమవారం విధులు చేరినట్టు జిల్లా వ్యవసాయాధికారి ఆర్ శ్రీనివాస్‌రావుతెలిపారు. ఈసందర్భంగా ఆయన పలువిషయాలు వెల్లడించారు.

ఇంటర్వ్యూ

ఆంధ్రజ్యోతి: జిల్లాకు కొత్తగాఎంతమంది మండల వ్యవసాయాధికారులను ప్రభుత్వం నియమించింది..?

డీఏవో: ప్రభుత్వం జిల్లాకు కొత్తగా 11మంది వ్యవసాయాధికారులను కేటాయించింది. సోమవారం వారంతావిధుల్లో చేరారు. పదిరోజుల శిక్షణ అనంతరం వారికి కేటాయించిన మండలాల్లో విధులు నిర్వహించనున్నారు.

ఆంధ్రజ్యోతి: ఏయే మండలాల్లో వ్యవసాయాధికారులను నియమించారు.?

డీఏవో: జిల్లాలో తిర్యాణి వ్యవసాధికారిగా వినయ్, రెబ్బెనకు దిలీప్, బెజ్జూరుకునాగరాజు, కౌటాలకు ప్రేమలత, సిర్పూరు(టి) గిరిషన్, పెంచికల్‌పేటకు మనీషా, చింతలమానేపల్లికి కార్తికేశ, లింగాపూర్‌కు సంజయ్‌కుమార్, కెరమెరికియుగేందర్, జిల్లావ్యవసాయాధికారికార్యాలయంలో సాంకేతిక వ్యవసాయాధికారులుగా దీప్తి, విజయ్‌ను నియమించాం.

ఆంధ్రజ్యోతి: రూ.2లక్షల రుణమాఫీ అందరికీ వర్తిస్తుందా..?

డీఏవో: రూ.2లక్షల రుణమాఫీ అందరికీ వర్తిస్తుంది. రూ.2లక్షల కంటే ఎక్కువగా ఉన్న రుణం తీసుకున్నవారు వాటిని తిరిగి కట్టాలని రైతులకు సూచించాం. దశల వారిగా రూ.2లక్షల రుణమాఫీ అందరికీ వర్తిస్తోంది.

ఆంధ్రజ్యోతి: జిల్లాలో వరి,పత్తి ఎంత సాగవుతోంది?

డీఏవో: జిల్లాలో3.45లక్షలఎకరాల్లో పత్తి 56వేల ఎకరాల్లో వరిపంట సాగవుతోంది. పత్తి, వరిపంటలు ఆశాజనకంగానే ఉన్నాయి.

విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలి



అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్ రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు పుస్తక పఠనం అలవాటు చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. రూంటురీడ్ ఇండియా సంస్థ సౌజన్యంతో ఆసిఫాబాద్ మండలం తుంపల్లిలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్‌లైబ్రరీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూంటురీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీలో వివిధ రకాల రంగురంగుల 500కథల పుస్తకాలు, పఠనసామగ్రిద్వారా విద్యార్థుల్లో విద్యాసామ ర్థ్యాలు పెం పొందించవచ్చన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డీఈవో ఉదయబాబు, రూంటురీడ్ రాష్ట్ర మేనేజర్ నరసింహచారి, కోఆర్డినేటర్ శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు సుభాష్‌బాబు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తాగునీరు సరఫరా చేయాలి..

వాంకిడి: మండలంలోని పాటగూడ గ్రామపంచాయతీ పరిధిలోని ఎనోలి కోలాంగూడ గ్రామానికి మిషన్ భగీరథ పథకం ద్వారా నీటిసరఫరా చేయాలని కోరుతూ సోమ వారం సీపీఎం ఆధ్వర్యంలో అదనపుకలెక్టర్ దీపక్ తివారికి వినతి పత్రం అందజేశారు. గ్రామంలో తాగునీరు వసతిలేక తీవ్ర ఇబ్బం దులు పడుతున్నామని చేతిపంపులు చెడిపోవడంతో తీవ్ర ఇబ్బం దులు ఎదుర్కొంటున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వీటీడీఏ వైస్‌ప్రెసిడెంట్ పగ్గు, సిడాం ధర్ము, ఆత్రం పోత తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ ప్రచారరథాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

కాగజ్‌నగర్, అక్టోబరు 21: సిర్పూరు పేపర్ మిల్లు, భారతీయ యువ శక్తి ట్రస్టు ఆధ్వర్యంలో ఉద్యోగ ప్రచారరథాన్ని ఎస్పీఎం గేటు ఎదుట సోమవారం జనరల్‌మేనేజర్ ఎంఎస్ గిరి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18నుంచి 30సంవత్సరాల యువతీ,యువకులకు జాతీయబ్యాంకుల ద్వారా రుణాన్ని ఇప్పిస్తామన్నారు. యువకుల కోసం అవగాహన కల్పించేందుకు ఈ రథాన్ని ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ మేనేజర్ రీన బిల్వాల్, ఆశోక్‌తో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆసిఫాబాద్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): అడ ప్రాజెక్టు వద్ద లేక్‌వ్యూరెస్టారెంట్ నిర్వహించేందుకు అర్హత,ఆసక్తిగల అభ్య ర్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఐటీడీఏ పీవో ఖుష్బు గుప్తా ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల28వతేదీలోగా ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు. మిగితావివరాలకు 9493535052, 9666748105లలో సంప్రదిం చాలన్నారు.

మండలాల్లో బీఆర్ఎస్ నాయకుల నిరసన





పెంచికలపేట, సిర్పూర్(టి)లో రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

పెంచికలపేట/సిర్పూర్(టి), అక్టోబరు 21(ఆంధ్ర జ్యోతి): ఎన్నికలసందర్భంగా రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు రైతు భరోసాపైచేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం పెంచికలపేట, సిర్పూర్‌మండలకేంద్రాల్లోని ప్రధానరహదారులపై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చి రైతు భరోసా అమలు చేయాలని కోరారు. పెంచికలపేటలో జరిగిన నిరసనలో నాయకులు శ్రీనివాస్, మహేష్, శేఖర్, తిరుపతి, సతీష్, సిర్పూర్(టి)లో అస్లం బీస్ అబ్దుల్లా, చాంద్, తదితరులున్నారు.

జడ భీమయ్యకు ప్రభుత్వ సాయం అందించాలి

కౌటాల, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని శిర్ష గ్రామానికి చెందిన జడ భీమయ్య గొర్రెలమంద శనివారం సిర్పూర్(టి) రైల్వే ట్రాక్‌పై రైలుఢీకొని 180గొర్రెలు, 10మేకలు మృతిచెందాయి. దీంతో బాధిత కుటుంబానికి న్యాయం చేసి ప్రభుత్వపరంగా ఆదుకోవాలని సోమవారం తహసీల్దార్‌కు యాదవసంఘం మండలాధ్యక్షుడు బట్ట మేకల గట్టయ్య వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జడ భీమయ్య గొర్రెలు కాస్తూ సంచారజీవనం చేస్తూ తనకుటుంబాన్ని పోషించుకుంటున్నాడని అతనికి ఎలాంటిఆధారం లేదని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. కార్యక్రమంలో యాదవసంఘం నాయకులు కడారి భీమయ్య, పోలి శ్రీశైలం పాల్గొన్నారు.

25న జాబ్ మేళా

ఆసిఫాబాద్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో ఈ నెల 25న నిరుద్యోగ యువత కోసం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఉపాధి కల్పనఅధికారి సతీష్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. హైదరా బాద్ కేఎల్ గ్రూపు నందు పనిచేయడానికి 200మంది లేడీ గార్డ్స్, మేల్ గార్డ్స్, సూపర్‌వైజర్స్, రిసెప్షనిస్టులను భర్తీ చేస్తామన్నారు. పదవ తరగతి, ఇంటర్, డిగ్రీ అర్హతతో 18-30 సంవత్సరాల వయసు కలిగిన వారు కాగజ్‌నగర్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహించే జాబ్‌మేళాకు హాజరు కావానల్నారు. మిగితా వివరాలకు 9550441888, 9160608476 నంబర్లను సంప్రదించాలన్నారు.

క్రైం కార్నర్

నిరక్షరాస్యులను బోల్తా కొట్టించి నిధుల మళ్లింపు

- 17 అకౌంట్ల నుంచి ఖాతాలోకి రూ.8.38 లక్షల మళ్లింపు
- పోలీసుల విచారణలో వెల్లడి, నిందితుడి అరెస్టు


నిందితుడిని అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ

కోటపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని తెలంగాణ గ్రామీణ బ్యాంకు వద్ద నిరక్షరాస్యులకు సహాయం చేస్తున్నానని నమ్మిస్తూ వారి అకౌంట్ నుంచి డబ్బులు కాజేసిన చల్ల సాయిరెడ్డిని సోమవారం పోలీసులు అరెస్టు చేశారు. కొండంపేట గ్రామానికి చెందిన గావిడి భీమయ్య ఈ నెల 3న అకౌంట్‌లో నుంచి రూ.6 వేలు డ్రా చేయడానికి బ్యాంక్‌కు వెళ్లాడు. భీమయ్య అమాయకత్వాన్ని ఆసరాగా తీసు కున్న సాయిరెడ్డి రెండు వోచర్లను రాసి ఇచ్చాడు. భీమయ్య రెండు వోచ ర్లను క్యాషియర్‌కు ఇవ్వగా రూ.6 వేలు డ్రా చేసి అతడికి ఇచ్చి సాయిరెడ్డి అకౌంట్‌కు రూ.59 వేలు ట్రాన్స్‌ఫర్ చేశాడు. ఇంటికి వెళ్లిన తర్వాత భీమయ్య ఫోన్‌కు వచ్చిన బ్యాంక్ మెసేజ్‌ను కొడుకు సతీష్ గమనించి బ్యాంకుకు వెళ్లి ఆరా తీయగా డబ్బులు సాయిరెడ్డి అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ అయినట్లు తేలింది. ఈ విషయమై సతీష్ కోటపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు విచారణ జరపగా సాయిరెడ్డి 17 అకౌంట్ల నుంచి రూ.8,38,250 అతడి అకౌంట్‌లోకి ట్రాన్స్‌ఫర్ చేయించినట్లు వెల్లడైంది. బ్యాంకు వద్ద ఉంటూ నిరక్షరాస్యుల అకౌంట్‌ల నుంచి డబ్బులు ఖాతాలోకి బదిలీ చేయించుకుని మోసానికి పాల్పడినందుకు సాయి రెడ్డిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజేందర్ వివరించారు. మిగితా బాధితుల పేర్లను బ్యాంకుకు అందించినట్లు ఎస్ఐ తెలిపారు.

భార్య కాపురానికి రావడం లేదని భర్త ఆత్మహత్య

బెల్లంపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భార్య కాపురానికి రావడం లేదనే మనస్తాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణంలోని మహ్మద్‌ఖాసీం బస్తీకి చెందిన చీర్ల హేమకార్తీక్ (36) ప్రైవేటు ఉద్యోగం చేస్తున్నాడు. కొంతకాలంగా భార్య శిరీషతో గొడవలు జరుగుతున్నాయి. వినాయక నిమజ్జనం రోజున గొడవ తీవ్రం కావడంతో భార్య పుట్టింటికి వెళ్లింది. అప్పటి నుంచి తిరిగి రాకపోవడంతో మనస్తాపానికి గురైన హేమకార్తీక్ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్‌హెచ్‌వో దేవయ్య తెలిపారు.

పేకాట స్థావరం నిర్వహకుడి అరెస్టు

కోటపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శెట్‌పల్లి గ్రామ శివారులో పేకాట స్థావరం నిర్వహిస్తూ పట్టుబడిన తాంధ్ర పోచం అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ రాజేందర్ పేర్కొన్నారు. గ్రామ శివారులో పేకాట నిర్వహిస్తూ మార్చి 29న పట్టుబడగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. మరోసారి పేకాట స్థావరం నిర్వహిస్తూ అక్టోబరు 2న పట్టుబడడంతో కేసు నమోదు చేశామన్నారు. పోచంను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ


ఎస్ఐ శ్వేత

భీమారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): భీమారం ఎస్ఐగా శ్వేత సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఎస్ఐ రాములు రామగుండం కమిషనరేట్‌కు బదిలీ అయ్యారు. చెన్నూరు ఎస్ఐగా విధులు నిర్వహించిన శ్వేత భీమారం ఎస్ఐగా వచ్చారు.

దొంగతనం కేసులో జైలు శిక్ష

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): దొంగతనం కేసులో మెజిస్ట్రేట్ ముఖేష్ నిందితుడికి సంవత్సరం జైలు శిక్ష విధించినట్లు సోమవారం టూటౌన్ ఎస్ఐ మహేందర్ తెలిపారు. పట్టణానికి చెందిన గుండేటి రాకేష్ మార్చి 2న పట్టణంలోని హైటెక్ వైన్‌షాపులో దొంగతనానికి పాల్పడ్డాడు. నేరం రుజువు కావడంతో సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ. 50 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

పురుగుల మందు తాగి యువతి ఆత్మహత్య

లింగాపూర్, అక్టోబరు21(ఆంధ్రజ్యోతి): ఘమనూర్ గ్రామానికి చెందిన శారద(20) ఆదివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడింది. శారద ఫోన్లో అధికంగా మాట్లాడుతుండడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో మనస్తాపం చెందిన శారద ఆదివారం రాత్రి ఇంట్లో పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

కాంగ్రెస్ నాయకుడి వాహనంపై దాడి

కాగజ్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన కాంగ్రెస్ టీపీసీసీ మెంబరు హర్షద్ హుస్సేన్ వాహనంపై సోమవారం వేకువ జామున దాడి జరిగింది. ఈ దాడిలో వాహనం అద్దం పగిలింది. పట్టణ ఎస్సై దీకొండ రమేష్ సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

మానవత్వం చాటుకున్న అంబులెన్స్ డ్రైవర్

బెల్లంపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): కాల్‌టెక్స్ పెట్రోలు బంకు ఎదుట సోమవారం గణేష్ అనే వ్యక్తి నడుచుకుంటూ వెళ్తూ మద్యం మత్తులో కిందపడ్డాడు. దీంతో తలకు గాయమైంది. రక్తం కారుతుండడం, స్పృహలో లేకపోవడంతో ఎవరూ పట్టించుకోలేదు. అటు వైపుగా వెళ్తున్న 108 అంబులెన్స్ డ్రైవర్ అసద్‌పాషా వాహనాన్ని నిలిపి ఈఎంటీ ప్రదీప్ సహాయంతో ప్రథమ చికిత్స చేసి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

తాటిచెట్టుపై పడిన పిడుగు

జైపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): నర్వా పంచాయతీ పరిధిలోని తాటిచెట్టుపై సోమవారం భారీ వర్షం కురిసింది. తాటిచెట్టుపై పిడుగు పడింది. స్థానికులు గమనించి ఎస్టీపీపీలోని ఫైర్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వడంతో వారు మంటలను ఆర్పివేశారు. చెట్టు సమీపంలో పెట్రోలు బంకు ఉండడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు.

గంజాయి సేవిస్తున్న వారి అరెస్టు

హాజీపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): రాపల్లి గ్రామశివారులో సోమవారం గంజాయి సేవిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేష్ తెలిపారు. గంజాయి సేవిస్తున్నారనే సమాచారం మేరకు సంఘటన స్థలానికి వెళ్లగా నలుగురు పారిపోయేందుకు ప్రయత్నించగా పట్టుకున్నామన్నారు. వారి వద్ద నుంచి 83 గ్రాముల గంజాయి, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

ప్రమాదవశాత్తు కారు దగ్ధం


చెన్నూరు, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు పట్టణం నుంచి సోమవారం రాత్రి మంచిర్యాల వైపు వెళ్తున్న కారు (టీఎస్07 జీఏ 2866)లో ప్రమాదవశాత్తు కిష్టంపేట వద్ద మంటలు వ్యాపించాయి. డ్రైవర్ కారును ఆపి బయటపడ్డాడు. కారులో పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం అందించడంతో చెన్నూరు ఫైర్ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పివేశారు.

విద్యార్థికి రూ.15 వేల ఆర్థిక సహాయం

గర్మిళ్ల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సరస్వతి శిశుమందిర్ విద్యాలయంలో 7వ తరగతి చదువుతున్న తల్లి తండ్రి లేని నిరుపేద విద్యార్థి రాసపల్లి ప్రేమ్ కుమార్‌కు దుర్గం పోషం చారిటబుల్ ట్రస్టు చైర్మన్ రాజేశం సంవత్సరం ఫీజు రూ.15 వేలు సోమవారం అందజేశారు. శిశుమందిర్ గౌరవాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రావు, రెడ్‌క్రాస్ జిల్లా జనరల్ సెక్రెటరీ మహేందర్, శివశంకర్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి

మందమర్రి టౌన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : మందమర్రి పట్టణంలోని రెండో జోన్‌కు చెందిన జి.సత్యాన్వేష్ (18) అనే ఇంటర్ విద్యార్థి సోమవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. స్నానం చేసి దండెంపై దుస్తులు ఆరేస్తుండగా దండానికి ఆనుకొని ఉన్న విద్యుత్ తీగ తాగడంతో షాక్‌కు గురయ్యాడు. కుటుంబ సభ్యులు మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు.



ఆరేళ్లుగా విధుల కోసం ఎదురుచూపులు

- మెట్టు దిగని ఎస్పీఎం యాజమాన్యం
- ఇబ్బందులు పడుతున్న 200మంది పర్మినెంటు కార్మికులు

కాగజ్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్‌లో ఎస్పీఎం 2018లో పునఃప్రారంభం కాగా ఇక్కడి ప్రజలు అందులో పనిచేసినకార్మికులు చాలా సంతోషించారు. ఎన్నో పోరాటాల అనంతరం తమ కష్టం నెరవేరిందని ఇక తమ జీవితాలకు ఢోకా ఉండదని కార్మికులు భావించారు. కానీ ఎస్పీఎం దక్కించుకున్న జేకే యాజమాన్యం మిల్లులో పనిచేసిన కార్మికులందరినీ విధుల్లోకి తీసుకోలేదు. దాదాపు 200మంది పర్మినెంటు కార్మికులను పక్కనపెట్టింది.

ఈ విషయంలో న్యాయం చేసేందుకు కార్మికశాఖ అధికారులు ఎస్పీఎం యాజమాన్యంతో 2020లో చర్చలు జరపాలని సూచించినా కూడా యాజమాన్యం స్పందించలేదు. మరో పక్క యాజమాన్యం స్థానికేతరులు కొందరిని అధిక జీతాలకు నియమించుకుంది. ఇది నచ్చక స్థానికులు మిల్లు యాజమాన్య వైఖరిపై నిరసన తెలిపారు. ఇది సరైన విధానం కాదని పేర్కొంటున్నారు. మిల్లులో పనిచేసిన తమను కాకుండా ఇతర ప్రాంతాలకు చెందిన వారిని ఎలా తీసుకుంటారని ప్రశ్నిస్తున్నారు. తాము విధులు చేస్తామంటే యాజమాన్యం తీసుకోలేదు కాబట్టి కార్మిక చట్టాల ప్రకారం తమకు పూర్తి జీతాలు ఇవ్వాలని డిమాండు చేస్తున్నారు.

ఆరేళ్లుగా తాము విధులు లేక నరకయాతన పడుతున్నామని కార్మికులు పేర్కొంటున్నారు. తమను ఎప్పటికైనా యాజమాన్యం విధుల్లోకి తీసుకుంటుందన్న కొండంత ఆశతో ఎదురుచూస్తున్నామని పేర్కొంటున్నారు. మిల్లు తెరిస్తే తమ జీవితాలు బాగుపడతాయని ఆశిస్తే యాజమాన్యం తమను పట్టించుకోకపోవడం తీవ్ర ఆవేదన గురిచేస్తోందని కార్మికులు పేర్కొంటున్నారు. ఈ వయస్సులో కొత్త పనులు చేసి కుటుంబాన్ని ఎలా పోషించేది అని ఆవేదన చెందుతున్నారు.

యాజమాన్యం త్వరగా స్పందించాలి..

సూర్యప్రకాష్, ఎస్పీఎం ఎంప్లాయీస్‌వర్కర్స్ నెగోషియేషన్ కమిటీ కన్వీనర్



కార్మికులసంక్షేమం దిశగా యాజమాన్యం ఆలోచించాలి. తాము పనులు లేక ఇబ్బందులు పడుతున్నాం. తమను పనిలోకి తీసు కోవాలని పలుమార్లు వినతిపత్రాలు సమర్పించాం. అయినప్పటికీ యాజమాన్యం పట్టించుకోవటం లేదు.

ఎస్పీఎం యాజమాన్యం తీరు సరికాదు..

అంబాల ఓదెలు, ఎస్పీఎం ఎంప్లాయీస్, వర్కర్స్ నెగోషియేషన్ కమిటీ సభ్యుడు



ఎస్పీఎం యాజమాన్యం తీరు సరికాదు. కార్మికులందరినీ విధుల్లోకి తీ సుకోవాలి. ఇప్పుడో, అప్పుడో కబురు వస్తుందని అంతా కొండంత ఆశతో ఎదురుచూస్తున్నారు. కార్మికశాఖ తరుపున చర్చలు జరిపినప్పటికీ ఫలితంగా లేకుండా పోయింది.


డిమాండ్లను వివరిస్తున్న ఎస్పీఎం ఎంప్లాయిస్, వర్కర్స్ నెగోషియేషన్ కమిటీ సభ్యులు

గవర్నర్‌ను కలిసిన ఎమ్మెల్యే


రాష్ట్ర గవర్నర్‌తో సిర్పూరు ఎమ్మెల్యే

కాగజ్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో సోమవారం ఎమ్మెల్యే హరీష్‌బాబు రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పలు సమస్యలను గవర్నర్ దృష్టికి తీసుకువెళ్లారు.

ఏకగ్రీవంగా అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణ పద్మశాలి సంఘం అధ్య క్షుడిగా అనుమండ్ల శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శిగా అల్లె శ్రీకాంత్ ఏకగ్రీవంగా సోమవారం ఎన్నికైనట్లు ఎన్నికల నిర్వహణ సభ్యులు ప్రకాష్, మధుకర్, రవీందర్ తెలిపారు. సోమవారం ఎన్నికల ప్రణాళికలో భాగంగా కోమటిపల్లి లింగయ్య, జంజిరాల సంజీవ్ తననామినేషన్లు ఉపసంహరించుకోవడంతో అధ్యక్ష, ప్రధాన కార్యదర్శుల ఎన్నిక ఏకగ్రీవం అయినట్లు ప్రకటించారు. ఎన్నికైన వారికి ఈనెల 27న ధ్రువపత్రాలు అందజేస్తామని తెలిపారు.

శాంతియుత వాతావరణం కోసం పోలీసుల కృషి


బ్లాంకెట్స్‌ను పంపిణీ చేస్తున్న సీఐ శ్రీనివాస్ రావు

కాగజ్‌నగర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సమాజంలో శాంతియుత వాతావరణం కోసం పోలీసులు కృషి చేస్తున్నారని రూరల్‌సీఐ శ్రీనివాస్‌రావు తెలిపారు. సోమవారం రాత్రి కాగజ్‌నగర్ మండలం రేగులగూడలో గిరిజనుకు బ్లాంకెట్స్ రేషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుల త్యాగాల గుర్తు చేసుకునేందుకు పోలీసు అమర వీరుల దినోత్సవాలను జరుపుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సై మహేందర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలీస్ హౌజ్: కాగజ్‌నగర్ పట్టణంలో సోమవారం పోలీస్‌హౌజ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శంకరయ్య మాట్లాడుతూ శాంతిభద్రతలను కాపాడటంలో పోలీసులు ముందుంటారన్నారు. ప్రజల భద్రతకోసం పోలీసులు తమ ప్రాణాలను పణంగా పెట్టి రక్షిస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా వివిధ తుపాకులను వాడే తీరును వివరించారు. కార్యక్రమంలో ఎస్సైలు సాగర్, దీకొండరమేష్,సిబ్బందిపాల్గొన్నారు.

ఘనంగా పోలీసు అమరవీరుల దినోత్సవం

కౌటాల: మండల కేంద్రంలో సోమవారం పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎస్సై మధుకర్ ఆధ్వర్యంలో పోలీసు అమర వీరులకు నివాళులు అర్పించి మండల కేంద్రంలోని పోలీసుస్టేషన్ నుంచి ప్రధానరహదారి గుండా విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిం చారు. పోలీసుల సేవలు మరువలేనవని అన్నారు. విధి నిర్వహణలో అమరులైన పోలీసుల త్యాగాలను గుర్తుకు చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ


విద్యార్థిని శైలజను అభినందిస్తున్న డీడీ రమాదేవి

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): గుంటూరులోని ఆచార్యనాగార్జున యూనివర్సిటీలో జరిగిన సౌత్‌జోన్ జాతీయ స్థాయి అథ్లెటిక్ పోటీల్లో ఆసిఫాబాద్ గిరిజన క్రీడాపాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఆలం శైలజ అండర్-14 జావీలిన్‌త్రో విభాగంలో బ్రాంజ్‌మెడల్ సాధించినట్లు గిరిజన క్రీడాఅధికారి బండ మీనారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు జంగు తెలిపారు. ఈ సందర్భంగా శిక్షకుడు విద్యాసాగర్, డీడీ రమాదేవి, ఏసీఎంవో ఉద్ధవ్, ఏటీడీవో చిరంజీవి, జీసీడీవో శకుంతల, కోట్నాక విజయ్, సట్లా శంకర్, లక్ష్మణ్, శిక్షకులు అరవింద్, తిరుమల్, తదితరులు విద్యార్థినిని అభినందించారు.

దుకాణాలను తొలగించాలి

బెజ్జూరు, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని కుమరంభీం విగ్రహం చుట్టూ ఉన్న కూరగాయల దుకాణాలను వెంటనే తొలగించాలని కౌటాల సీఐ రమేష్ ఆదేశించారు. సోమవారం బెజ్జూరుకు వచ్చిన సందర్భంగా గిరిజన నాయకులు కుమరంభీం విగ్రహం చుట్టూ ఉన్న కూరగాయలు దుకాణాలను తొలగించాలని కోరగా తక్షణమే స్పందించిన ఆయన కూరగాయల దుకాణాలను తొలగించేలా చూడాలని ఎస్సై విక్రంను ఆదేశించారు. భీం విగ్రహానికి రక్షణ కల్పించాలని ఆదేశించారు. కంచె ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు. వ్యాపారులకు స్థలం కేటాయించాలని కార్యదర్శి తుకారాంను ఆదేశించారు.

ఘనంగా ఎంపీ గోడం నగేష్ జన్మదిన వేడుకలు

ఆసిఫాబాద్‌రూరల్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ పట్టణంలో బీజేపీ సీనియర్‌నాయకుడు అరిగెలనాగేశ్వర్ నివాసంలో ఎంపీ గోడంనగేష్ జన్మదిన వేడుకలను సోమవారం మాజీఎంపీపీ మల్లికార్జున్ యాదవ్‌తోకలిసి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేశారు. కార్యక్రమంలో నాయకులు మంగ పెంటయ్య, విశాల్, ప్రసాద్‌గౌడ్, శ్రీకాంత్,సంతోష్, సత్యనారాయణ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై దశల వారి పోరాటాలు: సీపీఎం

కాగజ్‌నగర్, అక్టోబరు 21: ప్రజాసమస్యలపై సీపీఎం దశలవారీ పోరాటాలు చేస్తుందని సీపీ ఎం రాష్ట్రకార్యదర్శి పాలడుగుభాస్కర్ తెలిపారు. సోమవారం కాగజ్‌నగర్‌లో ఆయన మాట్లాడారు. ఈనెల9, 10, 11తేదీల్లో 3వ జిల్లా మహాసభలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. ఈ సభలను అంతా విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలోనాయకులు బండారురవికుమార్, కూశన్న రాజన్న, ముంజం ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.



'నూతన బొగ్గు గనులు తీసుకొస్తాం'

శ్రీరాంపూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): నూతనబొగ్గుగనులు తీసుకొస్తామని ఐఎన్‌టీయూసీ సెక్రెటరీజనరల్ బి జనక్‌ప్రసాద్ అన్నారు. శ్రీరాంపూర్‌లోని ఆర్‌కే5గనితోపాటు ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. త్వరలో కాంట్రాక్టు కార్మికులకు వేతనాలు పెంచేలా జీవోలు గెజిట్ చేయిస్తామని అన్నారు. కార్మికుల సొంతింటి కల నెరవేర్చేందుకు ఆరు జిల్లాల్లో 600ఎకరాల భూమి, రుణాలు ఇప్పిస్తామని తెలిపారు. అనంతరం పలు యూనియన్లకు చెందిన జీవన్ జోయల్, కందుల శంకరయ్య, సదయ్య, లక్ష్మీనారాయణ, లచ్చన్న, చంద్రమౌళి, తదితరులు ఐఎన్‌టీయూసీలో చేరగా, వారికి జనక్‌ప్రసాద్ యూనియన్ కండువాలు కప్పారు. ఆయాకార్యక్రమాల్లో ఐఎన్‌టీయూసీ ఏరియాఉపాధ్యక్షుడు జెట్టిశంకర్‌రావు, సీనియర్ ఉపాధ్యక్షుడు కాంపెల్లి సమ్మయ్య, జాతీయసమితిసభ్యుడు భీంరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

క్వాలిటీ జీఎంపై చర్యలు చేపట్టాలి: సీఐటీయూ

శ్రీరాంపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి రీజనల్ క్వాలిటీ జీఎం అల్లిరాజేశ్వర్‌పై చర్యలు చేపట్టాలని సింగరేణి కాంట్రాక్ట్‌కార్మికసంఘం (సీఐటీయూ) రాష్ట్రఅధ్యక్షుడు దూలం శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. క్వాలిటీ జీఎం తన వద్ద పనిచేసే కన్వేయన్స్ డ్రైవర్ అత్తర్ హుస్సేన్‌పై తప్పుడు కేసు బనాయించి ఇబ్బందులకు గురిచేస్తున్నాడన్నారు. తప్పుడు కేసుపెట్టి, సంస్థకు నష్టంచేయాలని చూసిన క్వాలిటీ జీఎంపై చర్యలు చేపట్టాలని ఆయన కోరారు. లేదంటే కార్మికుల ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

ఉల్లాసంగా ఫ్యామిలీ డే వేడుకలు

శ్రీరాంపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంపూర్‌లోని సీఈఆర్ క్లబ్‌లో ఫ్యామిలీడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఏరియా జీఎం బి సంజీవరెడ్డి హాజరై మాట్లాడారు. క్లబ్‌సభ్యులు కుటుంబ సభ్యులతో కలిసి వేడుకలు నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. ఇలాంటి కార్యక్రమాలవల్ల కుటుంబసభ్యుల నడుమ స్నేహపూర్వక వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. ఏరియాలో 8582మంది ఎన్‌సీడబ్ల్యూఏ ఉద్యోగులు ఉండగా, 189 మంది మాత్రమే సభ్యత్వం తీసుకున్నారని, ఈ సంఖ్య పెంచుకొని క్లబ్ కార్యక్రమాలను విస్తృతపర్చాలని సూచించారు. అనంతరం సేవాసమితి సభ్యులుచేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సేవాసమితి అధ్యక్షురాలు రాధాకుమారి, ఏఐటీయూసీబ్రాంచ్ కార్యదర్శి బాజీసైదా, డీజీఎం(పర్సనల్)అరవిందరావు, క్లబ్‌సభ్యులు పాల్గొన్నారు.



బహుమతులు అందిస్తున్న జీఎం, తదితరులు

ఓసీపీ బ్లాస్టింగ్‌తో ఇళ్లకు పగుళ్లు


పేలుళ్ల దాటికి చిందరవందర అయిన ఇంట్లోని సామాను

జైపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇందారం గ్రామంలోని దొరగారి పల్లెలో ఐకేఓసీపీ బ్లాస్టింగ్‌లకు సోమవారం ఉదయం పాలవేన మల్లమ్మ ఇల్లు కూలింది. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంట్లో తన కుమారుడు సురేష్ నిద్రిస్తున్న సమయంలో అకస్మాత్తుగా ఇల్లు వెనకభాగం కూలింది. ముందు భాగం కూలితే ఇద్దరి ప్రాణాలు పోయేవి. ఇందారం ఓపెన్ కాస్టు నిబంధనలకు విరుద్ధంగా నివాసాలకు అతిసమీపంలోకి రావడంతో బ్లాస్టింగ్ వైబ్రేష న్‌లు ఎక్కువయ్యాయని స్థానికులు పేర్కొంటున్నారు. కాగా కూలినఇంటిని ఇందరాం ఓసీపీ ప్రాజెక్టు అధికారి వెంకటేశ్వర్‌రెడ్డి, సేఫ్టీ అధికారి సతీష్ పరిశీలించారు. సివిల్ డిపార్టుమెంటు వారితో మాట్లాడి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

ఉచిత వృత్తిశిక్షణ కోర్సులను సద్వినియోగం చేసుకోవాలి

రెబ్బెన, అక్టోబరు 21: సింగరేణి సేవా సంస్థ ద్వారా మహిళలకు ఉచిత వృత్తి శిక్షణ కోర్సులు నిర్వహిస్తున్నామని, ఈ కోర్సులను మహిళలు సద్వినియోగం చేసుకోవాలి జీఎం శ్రీనివాస్ తెలిపారు. సోమవారం గోలేటి సీఈఆర్ క్లబ్‌లో నిర్వహించిన వృత్తిశిక్షణ కోర్సుల సర్టిఫికేట్ల పంపిణీలో ఆయన మాట్లాడారు. సింగరేణి సంస్థ మహిళ ఆర్థిక పురోగతి కోసం కృషి చేస్తోందన్నారు. సింగరేణి సేవాసమితి అధ్యక్షురాలు ఉమారాణి, ఏఐటీయూసీ నాయకుడు శేషశయనరావు, పర్సనల్ మేనేజర్ తిరుపతిపాల్గొన్నారు.

బదిలీ వర్కర్లు జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరణ

గోదావరిఖని, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సింగరేణిలో పనిచేస్తున్న 2349 మంది బదిలీ వర్కర్లను జనరల్ మజ్దూర్లుగా క్రమబద్ధీకరిస్తూ యాజమాన్యం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ సీఎండీ ఎన్ బలరాం ఆదేశాల మేరకు అన్ని ఏరియాలకు ఉత్తర్వుల పత్రాలను విడుదల చేశారు. సంస్థలో చేరినప్పటి నుంచి క్యాలెండర్ ఏడాదిలో భూ గర్భ గనుల్లో 190 రోజులు, ఉపరితల గనులు, విభాగాల్లో 240రోజులు విధులు నిర్వహించిన వారిని రెగ్యులరైజ్ చేశారు. సెప్టెంబరు 1, 2024 నుంచి వీరిని జనరల్ మజ్దూర్లుగా గుర్తించినట్లు ఉత్తర్వులలో పేర్కొన్నారు. జనరల్ మజ్దూర్లుగా అత్యధికంగా శ్రీరాంపూర్ నుంచి 662మంది ఉద్యోగోన్నత పత్రాలను పొందారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

బెల్లంపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి కాంట్రాక్టుకార్మికుల సమస్యలను పరిష్కరించాలని టీఎస్‌టీయూసీ ప్రధానకార్యదర్శి మణిరాంసింగ్ పేర్కొన్నారు. సోమవారం పట్టణంలోని టీఎస్‌టీయూసీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గుర్తింపుసంఘం ఎన్నికల సందర్భంలో కాంట్రాక్టు కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయడంలో విఫలమైందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సింగరేణి కాంట్రాక్టు కార్మికులను పరిష్కరించాలని కోరారు. సమావేశంలో నాయకులు గద్దెల నారాయణ, మల్లయ్య, భూషణ్, గోపాల్, సత్యనారాయణ, పోశం, హసన్, ఓదెలు తదితరులు పాల్గొన్నారు.

సమ్మెకు మెజార్టీ కార్మికుల మద్దతు

జైపూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీ కాంట్రాక్టు కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఏర్పాటుచేసిన అభిప్రాయసేకరణలో సమ్మెకే మెజార్టీ కార్మి కులు మద్దతు తెలిపారని హెచ్‌ఎంఎస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు రియాజ్ అహ్మద్ పేర్కొన్నారు. దీంతో సమ్మెచేయడానికి నిర్ణయించామన్నారు. ఒక్కరోజు టోకెన్‌సమ్మె చేయడానికి నిర్ణయించామని, సమస్యలను పరిష్కరించకపోతే నిరవధిక సమ్మెచేయడానికి హెచ్‌ఎంఎస్ సిద్ధంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు తిప్పారపు సారయ్య, అనిల్‌రెడ్డి, విక్రమ్‌కుమార్, సంపత్, సాయికృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను నిలదీయండి

శ్రీరాంపూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): హామీలు నెరవేర్చని గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలను నిలదీయాలని హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు తిప్పారపు సారయ్య అన్నారు. శ్రీరాంపూర్‌లోని యూనియన్ కార్యాలయంలో ఆయన మాట్లాడారు. గుర్తింపుఎన్నికల సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎన్‌టీ యూసీ సంఘాలు, రాజకీయపార్టీల నాయకులు కార్మికులకు అనేక హామీలు ఇచ్చారని తెలిపారు. కానీ వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. సమావేశంలో ఏరియాకార్యదర్శి వి అనిల్‌రెడ్డి, చెవుల శ్రీనివాస్, అయిల్ల రమేష్, నోముల బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి మనుగడ సాగాలంటే కొత్తగనులు రావాలి

శ్రీరాంపూర్, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): సింగరేణి మనుగడ కొనసాగాలంటే కొత్తగనులు రావాలని ఏఐటీయూసీ ఉప ప్రధానకార్యదర్శులు కందికట్ల వీరభద్రయ్య, ముష్కెసమ్మయ్య అన్నారు. ఎస్ఆర్పీ3గనిపై నిర్వహించిన గేట్ మీటింగ్‌కు వారు ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. ప్రస్తుతం ఉన్న గనులు మరో పది, పదిహేనేళ్ల కొనసాగుతాయని, కొత్త గనులు రాకుంటే కార్మికుల భవిష్యత్తు అంధకారంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బ్రాంచ్ సహాయకార్యదర్శి మోత్కూరి కొమురయ్య, సంయుక్త కార్యదర్శి రాచర్ల చంద్రమోహన్, నాయకులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు పెంచడమే లక్ష్యం

(ఐదో పేజీ తరువాయి)

ఉన్నత పాఠశాలలు 108, కేజీబీవీ 18, మోడల్ స్కూళ్లు 5, టీఎస్ ఆర్ఎస్ పాఠశాల ఒకటి ఉన్నాయి. వాటిలో మొత్తం 20,010 విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు.

ఆంధ్రజ్యోతి : ఇటీవల జరిగిన డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో ఎంత మంది ఉపాధ్యాయులు భర్తీ అయ్యారు..?

డీఈవో : రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల చేపట్టిన డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో జిల్లాలో 288 మంది ఎంపిక కాగా 251 మంది ఉద్యోగాల్లో చేరారు. దీంతో ఇంతకాలం ఖాళీగా ఉన్న పోస్టుల్లో అధికశాతం భర్తీ అయ్యాయి. కొత్త ఉపాధ్యాయులరాకతో విద్యా ప్రమాణాలు మరింతగా పెరగనున్నాయి.

ఆంధ్రజ్యోతి : రెగ్యులర్ టీచర్లు లేనిచోట స్కూల్స్‌ను నిర్వహించడంలో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

డీఈవో : జిల్లా వ్యాప్తంగా అన్ని పాఠశాలల్లో రెగ్యులర్ టీచర్లు ఉన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థుల నగటు నిష్పత్తి 1:30 ప్రకారంగా ఉపాధ్యాయులు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయుల లోటు ఎక్కడా లేదు.

ఆంధ్రజ్యోతి : ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై టీచర్లకు శిక్షణ ఇస్తున్నారా..?

డీఈవో : ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్) కార్యక్రమం 2022లో ప్రారంభించారు. దీనిపై యేటా 6 కాంప్లెక్స్ మీటింగ్‌లను నిర్వహిస్తూ శిక్షణ ఇస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 1 నుంచి 5వ తరగతి చదువుతున్న 14 వేల పైచిలుకు విద్యార్థులకు కనీస సామర్థ్యాలతోపాటు తరగతి వారీగా అభ్యాసన ఫలితాల నష్టాన్ని పూడ్చేందుకు దోహద పడుతోంది. ప్రణాళికబద్ధమైన బోధన, అభ్యాసన ప్రక్రియ ద్వారా చర్యలు చేపడుతున్నాం.

ఆంధ్రజ్యోతి : శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలలు ఎన్ని ఉన్నాయి..? వాటిని అభివృద్ధి చేసేందుకు ఎలాంటి చర్యలు చేపడుతున్నారు..?

డీఈవో : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శిథిలావస్థకు చేరుకున్న పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నాం. జిల్లా వ్యాప్తంగా 739 పాఠశాలలను గుర్తించి అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో ఎంపిక చేశాం. వాటి అభివృద్ధికి ప్రభుత్వం అవసరమైన నిధులు మంజూరు చేయడంతో అభివృద్ధి పనులు చేపడుతున్నాం. పనులు దాదాపు 90శాతం పూర్తయ్యాయి. ఈ కార్యక్రమంపై కలెక్టర్ సమావేశాలు నిర్వహిస్తూ పనులపై ఆరా తీస్తున్నారు.


విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలి



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ మోతిలాల్

హాజీపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల్లో పఠన సామర్థ్యం పెంపొందించాలని అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్ అన్నారు. సోమవారం పడ్తన్‌పల్లి పాఠశాలలో రూమ్ టూ రీడ్ ఇండియా వారు ఏర్పాటు చేసిన మోడల్ లైబ్రరీని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రాథమిక స్థాయిలో విద్యార్థుల్లో చదవడం అలవాటు చేయడం ద్వారా వారిని స్వతంత్ర పాఠకులుగా తీర్చిదిద్దేందుకు జిల్లాలో రూమ్ టూ రీడ్ ఇండియా ట్రస్టు, యుఎస్ఏఐడీ సహకారంతో ప్రతీ మండలంలో ఒక మోడల్ లైబ్రరీలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఈ లైబ్రరీలో కథ పుస్తకాలు, పఠన సామగ్రి ద్వారా విద్యా సామర్థ్యాలు పెరుగుతాయన్నారు. తల్లి దండ్రులు వారి ఇంటి వద్ద మంచి విలువలతో కూడిన విద్యాభ్యాసం అందించాలని తెలిపారు. డీఈవో యాదయ్య, రూమ్ టూ రీడ్ తెలంగాణ స్టేట్ మేనేజర్ నరసింహాచారి, జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తం నాయక్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గా ప్రసాద్, సమగ్ర శిక్ష సెక్టోరల్ అధికారులు చౌదరి, సత్యనారాయణమూర్తి, తహసీల్దార్ శ్రీనివాసరావు, ఎంఈవో పోచయ్య, ప్రధానోపాధ్యాయుడు హను మాండ్లు, తల్లి దండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం



శారీరక, మానసిక సమస్యలకు చెక్

పెరుగుతున్న అభ్యాసకుల సంఖ్య

మంచిర్యాల అర్బన్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉరుకుల, పరుగుల జీవన ప్రయాణంలో శారీరకంగా, మానసికంగా ప్రజలు అలసిపోతున్నారు. కుటుంబం, వృత్తి, ఉద్యోగం, వ్యాపారంలో బిజీగా అంటూ తనను తాను పట్టించుకోవడమే మర్చిపోతున్నారు. దీంతో మానసిక ఒత్తిళ్లకు గురవడమే కాకుండా అనారోగ్యానికి గురవుతున్నారు. ఆసుపత్రుల చుట్టూ తిరుగుతూ జేబులు ఖాళీ అవుతున్నాయే తప్ప శాశ్వత పరిష్కారం లభించడం లేదు. దైనందిన జీవితంలో యోగాను భాగం చేసుకోవడంతో అనేక సమస్యలను అధిగమించవచ్చు. యోగాతో ఆరోగ్యం లభిస్తుందన్న విషయం శాస్త్రీయంగా నిరూపితమైంది. రోజు గంటపాటు యోగా చేయడం వల్ల శరీరంలోని అవయవాల పనితీరు మెరుగుపడటంతోపాటు మానసికంగా ఒత్తిళ్లను జయించవచ్చు.


యోగాసనాలు వేస్తున్న అభ్యాసకులు

యోగా అందరికీ అవసరమే

మారిన జీవన విధానం కారణంగా ప్రస్తుత కాలంలో చిన్నా, పెద్దా అనే తేడా లేకుండా యోగా అనేది అందరికీ అవసరమే. మానవ శరీరంలోని 7 చక్రాలు వాటి వాటి విధులను సక్రమంగా నిర్వర్తించేందుకు కావాల్సిన శక్తి యోగా ద్వారా మెరుగ్గా లభిస్తుందనే చెప్పవచ్చు.

శారీరక, మానసిక సమస్యలకు చెక్

యోగాను దైనందిన జీవితంలో భాగం చేసుకుంటే అనేక లాభాలున్నాయి. శారీరకంగా అనేక సమస్యలకు చెక్ పెట్టొచ్చు. ఎముకలు, కీళ్లను దృఢంగా చేస్తుంది. బరువు అదుపులో ఉండేందుకు సహాయపడుతుంది. రక్తపోటును తగ్గిస్తుంది. మెదడు ఆరోగ్యాన్ని పెంచుతుంది. శ్వాసకోశ పనితీరును పెంచడంతోపాటు రోగ నిరోధక శక్తిని పెంపొందిస్తుంది. శరీరంలో ఉండే అన్ని అవయవాల పనితీరును మెరుగుపర్చడంలో యోగా ఎంతో దోహదపడుతుంది.యోగాలో భాగమైన ధ్యానం వల్ల మానసిక ఒత్తిళ్లకు చెక్ పెట్టవచ్చు. ప్రశాంతమైన జీవనాన్ని సాగించే వెసలుబాటు కల్గుతుంది.

పెరుగుతున్న అభ్యాసకుల సంఖ్య

జిల్లాలో యోగా అభ్యాసకుల సంఖ్య యేటా పెరుగుతోంది. దిన చర్యలో యోగాను ఒక భాగం



చేసుకోవడం, సరైన పద్ధతిలో చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. దీంతో అభ్యాసకులకు యోగాలో మెళకువలను నేర్పించేందుకు నిష్ణాతులైన శిక్షకులతో పదుల సంఖ్యలో యోగా సెంటర్లు వెలుస్తున్నాయి.

యోగాతో అనేక ప్రయోజనాలు

మండ శ్రీనివాస్, సీనియర్ యోగా మాస్టర్



యోగాతో అనేక ప్రయోజనాలున్నాయి. రోజు యోగా చేయడం వల్ల శారీరకంగా ఉండే అనారోగ్య సమస్యలు దూరమవుతాయి. అవయవాల పనితీరు మెరుగుపడుతుంది. సంపూర్ణ అరోగ్యం చేకూరుతుంది. మానసిక ప్రశాంతత లభించడంతో పాటు ఆత్మస్థైర్యం పెంపొందుతుంది.

బీపీ అదుపులోకి వచ్చింది

కోడూరి శ్రీనివాస్, యోగా అభ్యాసకుడు..



యోగా చేయక ముందు బీపీ సమస్యతో బాధపడేవాడిని. చలికాలం వచ్చిందంటే ఆస్తమా, దగ్గు, శ్వాస సంబంధిత సమస్యలు ఏర్పడేవి. నిత్యం యోగా సాధన చేయడం వల్ల బీపీ అదుపులోకి వచ్చింది. శ్వాస సంబంధిత సమస్యలు దూరమయ్యాయి.



పత్తి కొనుగోళ్లు ప్రారంభించేదెప్పుడు..?

5వ పేజీ తరువాయి..

విక్రయిస్తున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభం కావడంతో ప్రైవేటు వ్యాపారులు గణనీయంగా ధరలు తగ్గిస్తున్నట్లు తెలుస్తోంది. మరో వైపు వర్షాలు కురిస్తే ఏరిన పత్తి పాడయ్యే ప్రమాదం ఉండటంతో తప్పనిసరి పరిస్థితుల్లో రైతులు అమ్ముకో వలసి వస్తోంది. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయకపోవడంతోనే ప్రైవేట్ వ్యాపారులు పత్తికి మద్దతు ధర చెల్లించకుండా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. సీసీఐ కేంద్రాలు తెరిస్తే ఈ పరిస్థితి ఉండేది కాదనే అభిప్రాయాలు వ్యక్తమవు తున్నాయి. ప్రస్తుతం వర్షాల కారణంగా చేసులో ఉన్న పత్తిని ఏరాలా లేక వది లెయ్యాలా అని రైతులు సతమతమ వుతున్నారు. పత్తి ఏరి మార్కెట్‌కు తీసుకువస్తే ధర వచ్చే పరిస్థితి లేదు. ఏరకుంటే చెట్టు మీది పత్తి వర్షాలకు తడిసి తేమ పెరగడంతోపాటు రంగు మారే ప్రమాదమున్నది. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి పత్తి కొనుగోళ్లను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు. జిల్లా యంత్రాంగం ఈ విషయంలో చొరవ చూపించి కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

సీసీఐ మద్దతు ధరలు ఇలా....

పత్తి పంటకు 2024-25లో సీసీఐ ప్రకటించిన కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ)లు ఇలా ఉన్నాయి. పత్తి పొడవు పింజ రకం రూ. 7521 ఉండగా, మధ్య రకం రూన. 7471, పొట్టి పింజ రకం రూ. 7421 ఉంది. అలాగే 8 శాతం తేమ ఉంటే క్వింటాలుకు రూ. 7521, 9 శాతం ఉంటే రూ. 7445, 10 శాతం ఉంటే రూ. 7370, 11 శాతం ఉంటే రూ. 7295, 12 శాతం ఉంటే రూ. 7220 నిర్ణయించింది. పత్తి అమ్ముకునే రైతులు ఆధార్‌కార్డు జిరాక్స్, పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్ లింక్ ఉన్న మొబైల్ వెంట తీసుకెళ్లాలి. బ్యాంక్ అకౌంట్‌కు ఆధార్ లింకు తప్పనిసరిగా ఉండాలని నిబంధనలు చెబుతున్నాయి.

సౌత్‌జోన్ హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపిక


ఎంపికైన బోసు సంతోష్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): సౌత్‌జోన్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నమెంట్‌లో హ్యాండ్‌బాల్ పోటీలకు కాకతీయ విశ్వవిద్యాలయం నుంచి మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ తృతీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థి బోసు సంతోష్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీలకు ఎంపికైన విద్యార్థిని ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ నరేందర్‌రెడ్డి, క్రీడా విభాగాధిపతి ఆర్.గోపాలకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

పోస్టర్ల విడుదల

కాసిపేట, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): సల్పలవాగు వెంకటాద్రి ఆలయంలో ఈ నెల 27న నిర్వహించే దండోరా దర్బార్ పోస్టర్లను సోమవారం ఆదివారం ఆదివాసీ నాయ కులు కలెక్టరేట్‌లో విడుదల చేశారు. నిర్వహణ కమిటీ అధ్యక్షుడు ఆడె జంగు మాట్లాడుతూ యేటా నిర్వహించే దండోరా దర్బార్ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుతుందన్నారు. హాజరు కావాలని కలెక్టర్ కుమార్ దీపక్‌ను కోరారు. డీటీడీవో మడావి గంగారాం, నాయకులు పెంద్రం హన్మంతు, వెడ్మ కిషన్, ఆత్రం జంగు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.


దండోరా దర్బార్ పోస్టర్లను విడుదల చేస్తున్న కలెక్టర్ , నాయకులు

నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడుతా

లక్షెట్టిపేటరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో తనను గెలిపిస్తే నిరుద్యోగ సమస్యలపై నిరంతరం పోరాడుతానని ఎంఎల్‌సీ అభ్యర్థి డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం లక్షెట్టిపేటలోని పలు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు, జూనియర్, డిగ్రీ కళాశాలలు, బార్ అసోసి యేషన్ ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పట్టు బద్రుల ఎంఎల్‌సీ పరిధిలోని ఉమ్మడి నాలుగు జిల్లాల వ్యాప్తంగా నిరుద్యో గులకు స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలు ఏర్పాటు చేస్తానన్నారు. నవంబర్ 6లోగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు.

ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

నస్పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : వచ్చే ఏడాది జరిగే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా ప్రతీ ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) రాష్ట్ర అదనపు ప్రధాన కార్య దర్శి బండి రమేష్ కోరారు. నస్పూర్, తీగల్‌పహాడ్, సీతా రాంపల్లి జిల్లా పరిషత్ పాఠ శాలలు, కస్తూర్బా విద్యాలయంలో సోమవారం ఓటరు నమోదు దరఖాస్తు ఫారాలను ఉపాధ్యాయులకు అందించారు. రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని కోరారు. పీఆర్సీ, డీఏలు, పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలన్నారు. ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ ఈ నెల 22న భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన చెప్పాలన్నారు. తపస్ మండల అధ్యక్షుడు వెంకటరమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయండి

బెల్లంపల్లిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : పీడీఎస్‌యూ 50 వసం తాల స్వర్ణోత్సవ సభలను విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబరు 24న ఓయూలోని ఠాగూర్ ఆడిటోరియంలో జరిగే స్వర్ణోత్సవ సభలను నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విష్ణు, చత్రపతి, తిరుపతి, హేమంత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సాంప్రదాయబద్ధంగా దండారీ పూజలు


గుడిరేవులో పద్మల్‌పూరికాకో అమ్మవారిని దర్శించుకుంటున్న గిరిజనులు

దండేపల్లి, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి):గుడిరేవు గోదావరి నది ఒడ్డున పద్మల్ పురి కాకో ఏత్మల్‌సార్ పేన్ ఆలయానికి ఉమ్మడి జిల్లా నుంచి గిరిజనులు కుటుంబసమేతంగా సోమవారం తరలి వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. గుస్సాడి దండారీ ఉత్సవాల్లో భాగంగా గిరిజనులు ప్రత్యేక నైవేద్యాలను అమ్మవారికి సమర్పించారు. గిరిజనులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించి గంగమ్మ తల్లికి పూజలు చేశారు. అమ్మవారికి జలాభిషేకం చేసేందుకు డప్పువాయిద్యాలతో గుస్సాడీ వేషధారణలు, నృత్యాలతో ఆలయానికి చేరుకున్నారు. అనంతరం ఆలయం చుట్టు ప్రదక్షిణ చేసి కాకో అమ్మవారికి జలాభిషేకం పూజలు చేశారు. గుస్సాడీ నృత్యాలు చేస్తూ దండారీ సంబరాలను నిర్వహించారు. అనం తరం పలు రకరకాల పిండి పదార్థాలు తయారు చేసి కోళ్లలను, మేకలను బలి ఇచ్చి విందు ఆరగించారు. దీంతో పద్మల్‌పూరీ కాకో దేవాలయంలో గిరిజనులతో గుస్సాడి నృత్యాలతో ఆటాపాటలతో సందడి నెలకొంది.

స్విమ్మింగ్ పోటీల్లో విశ్రాంత సింగరేణి కార్మికుడి ప్రతిభ

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 20న 9వ తెలంగాణ మాస్టర్స్ ఇంటర్ డిస్ట్రిక్ట్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్-2024 పోటీలను నిర్వహించారు. అమ్మాగార్డెన్ ప్రాంతానికి చెందిన సింగరేణి విశ్రాంత కార్మికుడు పి.నారాయణ ప్రతిభ కనబర్చి పతకాలు సాధించాడు. 60 ప్లస్ ఏజ్ గ్రూప్‌లో 400 మీటర్స్ ఫ్రీస్టైల్ స్విమ్మింగ్‌లో, 50 మీటర్స్ బటర్ ఫ్లై స్విమ్మింగ్‌లో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్‌మెడల్ సాధించాడు. ఈ నెల 10న మధ్యప్రదేశ్‌లోని భోపాల్‌లో జరిగే మాస్టర్స్ స్విమ్మింగ్ పోటీలకు ఆయన ఎంపికయ్యారు.


పతకాలతో నారాయణ

అవార్డు అందుకున్న ఎయిమ్స్ వైద్యుడు

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి) : హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో యాక్ట్ నౌ ఆర్గనైజేషన్ సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో ఎయిమ్స్ ఆసుపత్రి తరుపు న డాక్టర్ శ్రీనివాస్ యెగ్గన అవార్డు అందుకున్నారు. ప్రజలకు అత్యుత్తమ వైద్య సేవలందిం చినందుకుగాను డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం ఎక్సలెన్స్ అవార్డును అందజేశారు. మంచి ర్యాలలో తక్కువ ఖర్చుతో అత్యాధునిక శస్త్ర చికిత్సలు అందించడంతో ఈ అవార్డు వచ్చిందన్నారు.



అవార్డు అందుకుంటున్న డాక్టర్ శ్రీనివాస్ యెగ్గన

వృత్తి ఉపాధ్యాయుడు.. ప్రవృత్తి ఆర్టిస్టు



పెన్సిల్ ఆర్ట్‌లో రామన్న చిత్రాలకు భలే క్రేజ్

కాగజ్‌నగర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూనే తీరిక సమయంలో తనకున్న కళలో రాణిస్తున్నారు కాగజ్‌నగర్ మండలం అంకుసాపూర్‌కు చెందిన ఎస్జీటీ ఉపాధ్యాయుడు రామన్న. పెన్సిల్ ఆర్ట్‌లో చక్కటి ప్రతిభను కనబరుస్తున్నారు. ఇతను వేసిన చిత్రాలు అందరి మన్ననలను పొందుతున్నాయి. అతను గీసిన చిత్రాన్ని సోషల్ మీడియా, ట్విట్టర్, ఇన్‌స్ట్రాగ్రాంలో పోస్టు చేస్తాడు. ఈ చిత్రాలకు సోషల్ మీడియాలో ఆదరణ లభిస్తోంది.

ఆసక్తి కలిగిందిలా..

వృత్తిరీత్యా ఉపాధ్యాయుడైన రామన్న పాఠాలు బోధించే సమయంలో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో బొమ్మలు వేసేవాడు. ఈ బొమ్మలు తోటి టీచర్లను ఆకట్టుకున్నాయి. అలా గుర్తింపు రావటం జరిగింది. కరోన సమయంలో ఖాళీగా ఉండటం ఎందుకని చిన్నబొమ్మలను వేయటం ప్రారంభించాడు. గీసిన బొమ్మను సోషల్ మీడియాలో పోస్టు చేయ డంతో గుర్తింపు వచ్చింది. అయితే పెన్సిల్ ఆర్ట్‌లో రాణించాలంటే మరింత మెరుగులు దిద్దాలని మిత్రులు సూచించడంతో పదును పెట్టాడు. 2019లో ప్రారంభించిన ఈ ప్రక్రియలో 2024వరకు దాదాపు 200 చిత్రాల వరకు గీశారు. చిత్రసీమకు సంబంధించిన హీరోలు, చిన్నారుల, గిరిజనుల ఫొటోలు రామన్న వేసిన వాటిలో ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ప్రస్తుతం పర్యావరణానికి సంబంధించిన చిత్రాలు వేస్తున్నట్టు రామన్న తెలిపాడు. ఒక్కో చిత్రం గీసేందుకు కనీసం మూడు గంటల సమయం పడుతుందని తెలిపారు.

పెన్సిల్ ఆర్ట్ అంటే చాలా ఇష్టం..

రామన్న, ఎస్జీటీ, అంకుసాపూర్



పెన్సిల్ ఆర్ట్ అంటే చాలా ఇష్టం. ఒక్కొక్క చిత్రం వేయాలంటే కనీసం మూడు గంటల సమయం పడుతుంది. తీరిక దొరికిందంటే బొమ్మలను గీస్తాను. కళను కాపాడాలన్నదే నా ఆశ. ఉపాధ్యాయ వృత్తిలో బీజీగా ఉన్నప్పటికీ కూడా తనకున్న కళకు మాత్రం పదును పెడుతుంటాను. అందరితో మన్ననలు పొందుతుంటే పడిన కష్టం ఇట్టే మర్చిపోతాను.


రామన్న పెన్సిల్‌తో గీసిన చిత్రాలు



న్యూస్ బాక్స్

అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం



కేటీఆర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న మాజీ ఎంపీపీ

హాజీపూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): అధైర్యపడొద్దు అండగా ఉంటామని మాజీమంత్రి కొప్పుల ఈశ్వర్, మాజీ ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు పేర్కొన్నారు. బీఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎంపీపీ స్వర్ణలత భర్త మందపల్లి శ్రీనివాస్‌పై రాపల్లి గ్రామానికి చెందిన కొందరు దాడి చేశారు. ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న శ్రీనివాస్‌ను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లామని పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి కేసు పెట్టి జైలుకు పంపించారు. విషయం తెలుసుకుని సోమవారం పరామర్శించారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్వర్ణలతతో ఫోన్‌లో మాట్లాడారు. పార్టీ అండగా ఉంటుందని తెలిపారు.

చీరల పంపిణీ

లక్సెట్టిపేటరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తిమ్మాపూర్‌లో ప్రభుత్వం అందజేసిన చీరలను కాంగ్రెస్ నాయకులు సోమవారం మహిళ సంఘాల సభ్యులకు అందజేశారు.

పత్తి కొనుగోళ్లు ప్రారంభించేదెప్పుడు..?





- పంట ఏరుతున్నా కొనుగోళ్లు చేయని సీసీఐ
- మరో మూడు వారాలు ఇదే పరిస్థితి
- గత నెల నుంచే మార్కెట్లోకి కొత్త పత్తి
- ప్రైవేటులో తక్కువ ధర చెల్లిస్తున్న వ్యాపారులు
- ఆలస్యం కావడంతో నష్టపోతున్న రైతులు

పత్తి రైతులు పరేషాన్‌లో పడ్డారు... సీసీఐ కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు నష్టపోతున్నారు... ప్రైవేట్ వ్యాపారులు పెట్టిన ధరకు విక్రయిస్తున్నారు. వర్షాలు కురుస్తుండడంతో పత్తి తడిస్తే తేమ పేరిట నష్టపోతామని రైతులు ఆందోళన చెందుతున్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

మంచిర్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పత్తి కొనుగోళ్ల ప్రారంభించడంలో సీసీఐ (కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా) జాప్యం చేస్తోంది. పంటను ప్రైవేటులో అమ్ముకుంటున్న రైతులు ఆర్థికంగా నష్టపోతున్నారు. అక్టోబరులోనే పత్తిపంట చేతికి రావడం ప్రారంభమవుతుండగా, ఇప్పటివరకు కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభించలేదు. మరో మూడు వారాలు ఇదే పరిస్థితి ఉండే అవకాశాలున్నాయి. అక్టోబరు, నవంబరు మాసాల్లో పత్తి తడిస్తే తేమ పేరిట వ్యాపారులు తక్కువ చెల్లిస్తారని, కొనుగోలుకు సీసీఐ ముందుకు రాదని రైతులు పత్తిని ఏరుతారు. అక్టోబరులోనే సీసీఐ కొను గోలు కేంద్రాలు ప్రారంభిస్తే రైతులకు మద్దతుధర వచ్చే అవకాశముంది. సీసీఐ నవంబరులో కొనుగోలు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఇప్పటికే పత్తి పగలడంతో విధిలేని పరిస్థితుల్లో పత్తి ఏరుతున్న రైతులు ప్రైవేట్ వ్యాపారులకే మద్దతు ధర రాకున్నా అమ్ముకుంటున్నారు.

వాతావరణ పరిస్థితులతో ఇబ్బందులు

పత్తి ఏరడం ప్రారంభించిన రైతులు ఇప్పటి వరకు అందిన పంటను ప్రైవేట్ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తేమ శాతం ఎక్కువగా ఉంటుందని సీసీఐ కొనుగోళ్లకు వెనుకాడుతోంది. నవంబరు రెండో వారం నుంచి కొనుగోలు చేపట్టాలని అధికారులు నిర్ణయించారు. సీసీఐ నిబంధనల మేరకు పత్తిలో తేమ 8 నుంచి 12 శాతం ఉంటేనే మద్దతు ధర లభిస్తుందని అధికారులు చెబుతున్నారు.

జిల్లాలో 1.5 లక్షల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో ఈ సంవత్సరం లక్షా 54వేల 249 ఎకరాల్లో రైతులు పత్తి సాగు చేశారు. ఎకరాకు 10 క్వింటాళ్ల చొప్పున 15,42,490 క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అంచనా. జిల్లాలో పండిన పత్తి పంటను కొనుగోలు చేసేందుకు జిల్లా వ్యాప్తంగా చెన్నూరు, బెల్లంపల్లి, లక్సెట్టిపేట మండలాల పరిధిలో ఏడు కొనుగోలు కేంద్రాలను అధికారులు గుర్తించారు. అయితే కొనుగోలు కేంద్రాల ప్రారంభం ఆలస్యం కానున్న నేపథ్యంలో రైతులు ప్రైవేటు మార్కెట్‌పై ఆధారపడితే సీసీఐలో కొనుగోళ్లలో అంచనాలు తారుమారు కాగా, రైతులకూ నష్టం వాటిల్లే అవకాశం ఉంది.

సెప్టెంబరు నుంచే మార్కెట్‌లో కొత్త పత్తి

పత్తి సీజన్ ఇప్పటికే ప్రారంభంకాగా గత నెల నుంచే ఏరిన పత్తిని మార్కెట్‌కు తరలిస్తున్నారు. దీంతో వ్యాపారులు పెట్టిన ధరకు

---మిగతా 7లో

విద్యాప్రమాణాలు పెంచడమే లక్ష్యం

ఇంటర్వ్యూ

- ప్రత్యేక కార్యాచరణతో కలిసికట్టుగా ముందుకు
- అమ్మ ఆదర్శ పథకంతో పాఠశాలల్లో మౌలిక వసతులు
- మంచిర్యాల జిల్లా విద్యాశాఖాధికారి యాకయ్య



డీఈవో యాకయ్య

మంచిర్యాల, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు పెంపొందించేందుకు ప్రత్యేక కార్యాచరణతో ముందుకు సాగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి యాకయ్య తెలిపారు. సోమవారం 'ఆంధ్రజ్యోతి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన జిల్లాలో చేపడుతున్న పలు కార్యక్రమాలపై వివరించారు.

ఆంధ్రజ్యోతి: విద్యార్థుల చదువులపై ఎలాంటి శ్రద్ధ వహిస్తు న్నారు. ఉపాధ్యాయులు సకాలంలో హాజరవుతున్నారా..?

డీఈవో: విద్యార్థుల చదువులపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాం. నాతో పాటు కో ఆర్డినేటర్లు ఎప్పటికప్పుడు మానిటరింగ్ చేస్తున్నారు. పాఠశాలలపై కలెక్టర్ ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించేలా చర్యలు చేపడుతున్నాం. ఈ విషయమై రోజూ మానిటరింగ్ చేస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : పాఠశాలల బలోపేతానికి ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు.?

డీఈవో : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలను పెంపొందించేలా ప్రత్యేక కార్యాచరణ చేపడుతున్నాం. విద్యార్థులను విద్యలోనే కాకుండా వారిలో వృత్తి నైపుణ్యాలను పెంపొందించేందుకు కృషి చేస్తున్నాం. ఇందులో భాగంగా మోడల్ స్కూళ్లలో హౌజ్ వైరింగ్, డ్రాయింగ్, తదితర కోర్సుల్లో శిక్షణ అందిస్తున్నాం.

ఆంధ్రజ్యోతి : జిల్లాలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి?

డీఈవో : జిల్లాలో ప్రాథమిక పాఠశాలలు 511 ఉండగా, 13,476 మంది విద్యార్థులు ఉన్నారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలు 97 ఉండగా, విద్యార్థులు 4,224 మంది ఉన్నారు.

మిగతా 7వ పేజీలో...

ఆరేళ్లుగా విధుల కోసం ఎదురుచూపులు

- మెట్టు దిగని ఎస్పీఎం యాజమాన్యం
- ఇబ్బందులు పడుతున్న 200మంది పర్మినెంటు కార్మికులు



ఎస్పీఎం మిల్లు గేటు

6

యోగాతో ఆరోగ్యం

- శారీరక, మానసిక సమస్యలకు చెక్
- పెరుగుతున్న అభ్యాసకుల సంఖ్య



7

ఉల్లాసంగా ఫ్యామిలీ డే

- సింగరేణి ఆధ్వర్యంలో వేడుకలు



6

ఆర్మీ జవాన్‌కు ఘన స్వాగతం



తాళ్లపేటలో ఆర్మీ జవాన్ వహీద్‌కు గ్రామంలో ఘన స్వాగతం

దండేపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): తాళ్లపేట గ్రామానికి చెందిన అబ్దుల్ వహీద్ 22 ఏళ్లుగా ఆర్మీ జవాన్‌గా పనిచేసి పదవీ విరమణ చేశాడు. ఆదివారం రాత్రి స్వగ్రామమైన తాళ్లపేటకు వచ్చారు. ఈ సందర్భంగా పదో తరగతి (1999-20) మిత్ర బృందం ఆయనను, కుటుంబ సభ్యులను సన్మానించారు. తాళ్లపేట బస్టాండ్ నుంచి ఇంటి వరకు ఓపెన్ టాప్ జీబులో భాజాభజంత్రీలతో ఊరేగింపు నిర్వహించారు. వహీద్ మాట్లాడుతూ దేశ సేవ చేయడం ఎంతో సంతృప్తినిచ్చిందన్నారు. యువకులు దేశ సేవకు సిద్ధంగా ఉండాలని, ఇందుకోసం ఆర్మీలో చేరాలని పిలుపునిచ్చారు.

కలెక్టరేట్ ఎదుట ఏఎన్‌ఎంల నిరసన



కలెక్టరేట్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న ఏఎన్‌ఎంలు

నస్పూర్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న ఏఎన్‌ఎంలకు వేతనాలు సక్రమంగా చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఎదుట సీఐటీయు ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను కలెక్టర్, జిల్లా గిరిజన అభివృద్ధి అధికారికి అందించారు. సీఐటీయు జిల్లా కార్యదర్శి దుంపల రంజిత్‌కుమార్ మాట్లాడుతూ గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో పని చేస్తున్న 18 మంది ఏఎన్‌ఎంలకు 13 నెలలుగా వేతనాలు రాలేదన్నారు. ప్రతీ నెల వేతనాలు అందేలా చర్యలు చేపట్టాలన్నారు. సుమిత్ర, భవాని, భారతి, లలిత, రాధాకుమారి, పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బెల్లంపల్లి, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత అన్నారు. సోమవారం 11, 12 వార్డుల్లో రూ.5 లక్షల నిధులతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తుందన్నారు. పలు వార్డుల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులను చేపడుతున్నామన్నారు. నిర్మాణాల్లో నాణ్యత లోపించకుండా చేపట్టాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, కౌన్సిలర్ శ్రీలత, డీఈ సాయికిరణ్, నాయకులు పాల్గొన్నారు.

బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలి

జన్నారం, అక్టోబరు 21(ఆంధ్రజ్యోతి): ఎలాంటి షరతులు లేకుండా 18 సంవత్సరాలు నిండిన ప్రతీ మహిళకు బతుకమ్మ చీరలు పంపిణీ చేయాలని బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి జనార్దన్ పేర్కొన్నారు. సోమవారం జన్నారంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వం ఇచ్చిన విధంగా మహిళలందరికి బతుకమ్మ చీరలను పంపిణీ చేయాలని కోరారు. భరత్‌కుమార్, గంగాధర్, ఫజల్‌ఖాన్ పాల్గొన్నారు.

'మంచి మంచిర్యాల' మాయం

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): ఐబీ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బ్యూటీ స్పాట్‌లో 'మంచి మంచిర్యాల' అనే అక్షరాలు మాయమయ్యాయి. సోమవారం తెల్లవారే సరికి సెల్ఫీ పాయింట్‌లో అక్షరాలు లేక బోసిగా దర్శనమిచ్చింది. మున్సిపాలిటీ నిధులు సుమారు రూ.20 లక్షలు వెచ్చించి 'మంచి మంచిర్యాల' అనే అక్షరాలతో నిర్మించారు. అక్షరాల తొలగింపుతో ఆ ఆనవాళ్లే లేకుండా పోయినట్లయింది.

పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరం

- అమరుల కుటుంబాలకు అండగా ఉంటాం
- రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్









కమిషనరేట్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ, కలెక్టర్, మందమర్రిలో అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న పోలీసులు, బెటాలియన్‌లో నివాళులర్పిస్తున్న కమాండెంట్

మంచిర్యాల అర్బన్, అక్టోబర్ 21 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల త్యాగాలు అజరామరమని, అమరుల కుటుంబాలకు పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని రామగుండం సీపీ ఎం.శ్రీనివాస్ అన్నారు. సోమవారం కమిషనరేట్ ఆవరణలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీ, మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్, పెద్దపల్లి డీసీపీ చేతన, డీసీపీ అడ్మిన్ సి.రాజు అమరుల స్థూపం వద్ద నివాళులర్పించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ 1959 అక్టోబర్ 21న భారత్-చైనా సరిహద్దున సియాచిన్ ప్రాంతంలోని భూభాగాన్ని ఆక్రమించేందుకు చైనా రక్షణ బలగాలు యత్నించగా 10మంది సీఆర్‌పీఎఫ్ జవాన్లు అమరులయ్యారన్నారు. దేశరక్షణ కోసం ప్రాణాలు అర్పించిన వారి జ్ఞాపకార్థం యేటా అక్టోబర్ 21న అమరుల సంస్మరణ దినంగా జరుపుకుంటున్నామన్నారు. పోలీసులు లేని సమాజాన్ని ఊహించలేమని, వ్యవస్థ సాఫీగా నడవాలంటే పోలీసులది కీలకపాత్ర అన్నారు. అమరులైన పోలీసుల స్ఫూర్తితో శాంతిభద్రతల పరిరక్షణకు మరింత మెరుగైన సేవలందిస్తామన్నారు. పది రోజుల పాటు పోలీసుల ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలను చేపడుతామన్నారు. అమరుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి పరిస్థితులను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ రాఘవేంద్రరావు, గోదావరిఖని ఏసీపీ ఎం.రమేష్, పెద్దపల్లి, మంచిర్యాల, జైపూర్ ఏసీపీలు జి.కృష్ణ, ఆర్.ప్రకాష్, వెంకటేశ్వర్లు, ట్రాఫిక్, టాస్క్‌ఫోర్స్, ఏఆర్ ఏసీపీలు నరసింహులు, మల్లారెడ్డి, ప్రతాప్, సీఐలు, ఎస్సైలు, పోలీస్ సంఘం అధ్యక్షుడు బోర్లకుంట పోచలింగం పాల్గొన్నారు.

హాజీపూర్ (ఆంధ్రజ్యోతి): గుడిపేట 13వ బెటాలియన్‌లో పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుని స్మృతి పరేడ్ నిర్వహించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసులకు అమరవీరుల స్థూపం వద్ద కమాండెంట్ వెంకటరాములు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అమర పోలీసులు చేసిన సేవలను కొనియాడారు. అసిస్టెంట్ కమాండెంట్‌లు నాగేశ్వర్‌రావు, కాళిదాసు, యూనిట్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సంతోష్‌సింగ్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

మందమర్రిటౌన్, (ఆంధ్రజ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణలో ప్రాణ త్యాగం చేసిన పోలీసు అమరవీరుల త్యాగం మరువలేనిదని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ తెలిపారు. సోమవారం పోలీస్‌స్టేషన్ అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి గౌరవ వందనం చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రజా ఆస్తుల రక్షణ, శాంతి భద్రతల కోసం పోలీసులు పని చేస్తున్నారని, ఒక్కో సందర్భంలో ప్రాణాలు కూడా కోల్పోతున్నారని పేర్కొన్నారు. వారి సేవలను స్మరిస్తూ వారోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. పోలీసు అమరుల త్యాగాలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. సీఐ శశిధర్‌రెడ్డి, ఎస్సై రాజశేఖర్, కాసిపేట, రామకృష్ణాపూర్, దేవాపూర్ ఎస్సైలు పాల్గొన్నారు.

బెల్లంపల్లిరూరల్ (ఆంధ్రజ్యోతి) : అమరుల త్యాగాలు చిరస్మరణీయమని బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్ అన్నారు. సోమవారం బెల్లంపల్లి ఏఆర్ హెడ్ క్వార్టర్స్‌లో ఏర్పాటు చేసిన పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవంలో పాల్గొని అమరులకు నివాళులర్పించారు. ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సయ్యద్ అఫ్జలుద్దీన్, వన్ టౌన్ ఇన్‌స్పెక్టర్ దేవయ్య, తాండూర్ సీఐ కుమారస్వామి, తాళ్లగురిజాల ఎస్ఐ రమేష్, పోలీసులు, సిబ్బంది పాల్గొన్నారు.

మంచిర్యాల అర్బన్ (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో రాముని చెరువు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో చెరువుకట్టపై వాకర్స్ రీడింగ్ రూమ్ ఆవరణలో పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమరవీరుల చిత్ర పటాలను ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, ఉపాధ్యక్షుడు అకుల సత్తయ్య, సెక్రటరీ పుష్పిరెడ్డి రాంరెడ్డి, పాల్గొన్నారు.

ఇసుక రవాణాకు అనుమతి ఇవ్వాలి

భీమారం, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లు ఇసుక రవాణా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, చెన్నూరు గోదావరి నది లేదా సుద్దాల పెద్దవాగు నుంచి అయినా అనుమతులు ఇవ్వాలని సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. జోడువాగు ఆరెకుల వాగు, నర్సింగాపూర్ పెద్ద వాగు అటవీ ప్రాంతంలో ఉండడంతో ఫారెస్టు అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. స్థానికంగా జరిగే అభివృద్ధి పనులకు ఇసుక దొరడం లేదన్నారు. ట్రాక్టర్ యాజమానులు వెంకటేశ్వర్లు, రాజ్‌కుమార్, చంద్రయ్య, శివ తదితరులు పాల్గొన్నారు.

పంటల పరిశీలన

మందమర్రిరూరల్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): ఇటీవల కురిసిన వర్షానికి చిర్రకుంట, పొన్నారం, తిమ్మాపూర్ గ్రామాల్లో వరి పంట నేలవాలగా సోమవారం మండల వ్యవసాయాధికారి కిరణ్మయి, ఏఈవోలు పంటలను పరిశీలించారు. వరి దుబ్బులను నిలబెట్టి కుచ్చులుగా కట్టాలన్నారు. నీటిని బయటకు పంపించాలన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్, ప్రజావాణిలో దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్

మంచిర్యాల కలెక్టరేట్, అక్టోబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో సెంటర్ ఫర్ రూరల్ మేనేజ్‌మెంట్ నేషనల్ లెవెల్ మానిటర్ సభ్యులు బాలమురళి, సునీల్, గణాంక అధికారి, డీఆర్‌డీవో కిషన్, డీపీవో వెంకటేశ్వర్‌రావుతో కలిసి సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లడుతూ ఈ నెల 15 నుంచి 19 వరకు 4 మండలాల్లోని 10 గ్రామాల్లో మానిటర్స్ సభ్యులు పర్యటిస్తారన్నారు. వారు అందించిన నివేదికల ప్రకారం తదుపరి కార్యాచరణ రూపొందించి పనులు నిర్వహించాలన్నారు.

ఓటు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలి

ఉపాధ్యాయుల, పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హత గల ప్రతీ ఒక్కరు ఓటు నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి అన్నారు. హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఉపాధ్యాయుల ఎమ్మెల్సీకి ఫారం 19, పట్టభద్రులకు ఫారం 18 ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఎన్నికలపై ప్రజలకు అవగాహన కల్పించేలా ప్రచారం చేయాలని సూచించారు. కలెక్టర్ కుమార్ దీపక్, అదనపు కలెక్టర్ మోతిలాల్, డీఆర్‌ఈవో కిషన్, భూసేకరణ ప్రత్యేక అధికారి చంద్రకళ పాల్గొన్నారు.

పత్తి కొనుగోలు కేంద్రాల ఏర్పాటు

జిల్లాలో రైతుల సౌకర్యార్థం పత్తి కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో జిల్లా వ్యవసాయాధికారి కల్పనతో కలిసి పత్తి కొనుగోలుపై రైతులకు అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 8 జిన్నింగ మిల్లులు ఉన్నాయని, కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు చర్యలు తీసుకొంటామన్నారు. ప్రభుత్వం పత్తిమద్దతు ధర క్వింటాలుకు రూ.7521 నిర్ణయించిందన్నారు. రైతులు దళారులకు అమ్మి మోసపోవద్దన్నారు. మార్కెట్ అధికారి మహ్మద్ షాబోద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి దరఖాస్తులు పరిష్కరించేందుకు చర్యలు

ప్రజావాణిలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అధికారుల సమన్వయంతో పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. కలెక్టరేట్‌లో ఆర్డీవో హరికృష్ణతో కలిసి అర్జీదారుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. చెన్నూరు, మందమర్రి, కాసిపేట, జన్నారం, లక్సెట్టిపేట, తాండూర్, మంచిర్యాల, దండేపల్లి ప్రాంతాల నుంచి ప్రజలు దరఖాస్తులు అందజేశారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో 21 దరఖాస్తులు వచ్చాయని, వాటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు.